పాతబస్తీలో ఫుట్‌పాత్‌ల అద్దె దందా..!

- లోపాయికారి ఒప్పందంతో ఫుట్‌పాత్‌లకు అద్దె వసూలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- పాతబస్తీలో కనిపించని ఫుట్‌పాత్‌లు
- నడిరోడ్డుపై వ్యాపారాలు.. ముందుకు సాగని వాహనాలు



ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో నడిరోడ్డుపైనే నడిచి వెళుతున్న పాదచారులు

చార్మినార్: పాతబస్తీలో అసలే ఇరుకు రోడ్లు.. ఆపై ఉన్న కొద్దిపాటి ఫుట్‌పాత్‌లు కూడా కబ్జాలకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్ ఆక్రమణలను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో దుకాణాలు (షో రూం)ల ముందున్న ఫుట్‌పాత్‌లు మా సొంతమన్నట్లు ఆయా షో రూంల యజమానులు వ్యవహరిస్తున్నారు. చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్ట్ (సీపీపీ–చార్మినార్ కాలిబాట పథకం) పనులు జరిగి ఏళ్లు గడుస్తున్నా ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి రావడం లేదు. కొంత మంది స్వయంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగిస్తుండగా మరికొంత మంది షోరూంల యజమానులు ఇతరులకు అనధికారికంగా అద్దెకిస్తున్నారు. రోజు, వారం, నెలకు ఇంత..అంటూ అద్దె పద్ధతిని కొనసాగిస్తున్నారు. ఇచ్చే వారికి..తీసుకునే వారికి మధ్య గుట్టుచప్పుడు కాకుండా లోపాయికారి ఒప్పందం కొనసాగుతోంది.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు..

ఫుట్‌పాత్ కబ్జాలను తొలగించాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు పాతబస్తీలో అమలు కావడం లేదు. దీంతో ఫుట్‌పాత్‌ల కబ్జాల అద్దెలు జోరుగా కొనసాగుతున్నాయి. మా దుకాణం ముందున్న ఫుట్‌పాత్‌పై మాకే అధికారం ఉందని.. మేము చెప్పినట్లు చేయకపోతే ఇక్కడ తాత్కాలికంగా చిరువ్యాపారం చేసుకోవడానికి వీలు లేదనే విషయాన్ని తేల్చి చెబుతున్నారని పత్తర్‌గట్టికి చెందిన ఓ చిరువ్యాపారి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఇతర ప్రధాన రోడ్లలో అప్పుడప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారులు, సంబంధిత పోలీసుల సహకారంతో ఫుట్‌పాత్‌ల తొలగింపు చేపడుతున్నప్పటికీ చార్మినార్ ప్రధాన రోడ్డులో మాత్రం వీలు పడడడం లేదు. వాస్తవానికి చార్మినార్, మక్కా మసీదు, లాడ్‌బజార్ తదితర ప్రదేశాలను సందర్శించడానికి ప్రతిరోజూ పర్యాటకులు పాతబస్తీకి వస్తుంటారు. దీంతో ఇక్కడి రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారతాయి. ఇక నడవడానికి ఫుట్‌పాత్‌లుండవు. వాహనాల మధ్య నుంచే రోడ్లపై బిక్కుబిక్కుమంటూ ముందుకెళ్లాల్సి ఉంటుంది. దీంతో అప్పుడప్పుడు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

రోడ్లు సైతం ఆక్రమించుకొని..

ఫుట్‌పాతులే కాదు రోడ్లు సైతం ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి.. ఒక్కటేమిటి పాతబస్తీలో సర్వమూ రోడ్లపైనే అమ్మకానికి ఉంటాయి. ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించడమే కాకుండా నడిరోడ్డుపై చిరువ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఇటీవల చార్మినార్ ట్రాఫిక్ పోలీసులు పత్తర్‌గట్టి నుంచి మదీనా వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినప్పటికీ..పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. స్థానిక చిరువ్యాపారులు, షో రూం నిర్వాహకులు తమతో సహకరించడం లేదని దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు.

ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తే..

- జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో పని చేస్తే ఆశించిన ఫలితాలుంటాయి.
- అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్న వారిని కట్టడి చేయాలి. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఫుట్‌పాత్ కబ్జాలను తొలగించాలి.
- చార్మినార్–మదినా రోడ్డులో కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు, ఆక్రమణల్ని నియంత్రించాలి.
- రోడ్లపైనే నిల్చుని అమ్మకాలు జరుపుతున్న వారిని క్రమపద్ధతిలో అనుమతించాలి. అవసరమైతే కట్టడి చేయాలి.
- పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట సిబ్బంది సంఖ్యని పెంచాలి.
- అవసరమైన చోట రోడ్ల విస్తరణ జరగాలి.
- ఇప్పటికే విస్తరించిన రోడ్ల కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలి.
- అనుమతి లేకుండా రోడ్లను ఇష్టం వచ్చినట్లు తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- రోడ్లపై విచ్చలవిడి పార్కింగ్‌లను నిషేధించాలి.
- ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని కట్టడి చేయాలి.

నీటిని పొదుపుగా వాడాలి



గోల్కొండ: నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారి రాఘవేందర్ అన్నారు. బుధవారం కుల్సుంపురా పార్కులో జలమండలి ఆధ్వర్యంలో నీటి సంరక్షణ–నీటి పొదుపు అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కుల్సుంపురా వాకర్స్ అసోసియేషన్ ఏఆర్‌డీఎస్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీటి పొదుపు నీటి భవిష్యత్తు అవసరాలపై రాఘవేందర్ వివరించారు. ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల నీటిని సంరక్షించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుపై కుల్సుంపురా వాకర్స్ వారు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి స్థానికులందరూ తమ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా నీటిని పొదుపుగా వాడుదామని అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి లైన్‌మెన్ కార్తీక్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీధర్‌సాగర్, జోన్నకుంటి మధుసుధన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మాస్టర్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉపాధ్యాయులు

డబీర్‌పురా: డబీర్‌పురా కట్టెలగూడలోని మాస్టర్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఇ.శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ ఇ.మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రసరంజని సంస్థ వార్షికోత్సవం



కళాకారులను సన్మానిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రసరంజని సంస్థ 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ..యువ రంగస్థల కళాకారులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆచార్య కోట్ల హనుమంతరావు దర్శకత్వం వహించిన నచికేత నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు, సినీ నటుడు తనికెళ్ల భరణి, సాహితీవేత్త సుధామ, రసరంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువ మోర్చా నాయకులు ముఖ్య పాత్ర పోషించాలి



మహేందర్, భరత్ కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర

గౌలిపురా: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా యువ మోర్చా నాయకులు ముఖ్య పాత్ర పోషించాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర సూచించారు. బుధవారం యువ మోర్చా రాష్ట్ర నూతన అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్, యువ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు ఎ.భరత్ కుమార్ గౌలిపురా డివిజన్‌లోని ఆలే జితేంద్ర నివాసంలో మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలే జితేంద్ర మహేందర్, భరత్ కుమార్‌లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలే జితేంద్ర మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో యువ మోర్చా నాయకులు కీలక పాత్ర పోషించాలన్నారు. దేశ అభివృద్ధిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని యువ మోర్చా నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అబ్-కీ-బార్ 400 పార్ అనే నినాదాన్ని ప్రతి ఒక్క పార్లమెంటు సీటు 400కు కేంద్ర బిందువుగా ఉండే విధంగా యువ నాయకులు ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి కీసరి జగన్మోహన్ చారి, యువ మోర్చా కన్వీనర్ ఎం.ఉదయ్ కిరణ్ రెడ్డి, జమాల్‌పూర్ అశోక్, అభిలాష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన నిర్వహిస్తున్న ఏసీపీ శంకర్

సుల్తాన్‌బజార్: సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్ అన్నారు. బుధవారం కోఠి మహిళా విశ్వవిద్యాలయం పీజీ సెమినార్ హాల్‌లో ఎంబీఏ, ఎమ్మెస్సీ విద్యార్థులకు సైబర్ క్రైం, సైబర్ సెక్యూరిటీ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యార్థినులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో తమ ఫొటోలను అప్‌లోడ్ చేయొద్దన్నారు. అలాగే డెబిట్, క్రెడిట్ కార్డుల నెంబర్లను పొందుపర్చవద్దన్నారు. ఒకవేళ కార్డు పోతే వాటిని వెంటనే బ్లాక్ చేయాలన్నారు. ఓటీపీలను సేవ్ చేసుకోవద్దన్నారు. ప్రస్తుతం సైబర్ నేరస్థులు లింకులను పంపిణీ మోసాలకు పాల్పడుతున్నారని, ఈ లింకులను ఓపెన్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గం వివిధ డివిజన్ల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ నాయకులకు అభివృద్ధి పనులపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎంతగానో చొరవ చూపుతున్నారన్నారు. ప్రజల ఆదరణ వల్లే తాను మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని ఎంత చేసినా ప్రజల రుణాన్ని తీర్చుకోలేనని ఆయన పేర్కొన్నారు. వేసవిలో ఏ ఒక్క బస్తీకి కూడా నీటి కొరత లేకుండా చూడడానికి జలమండలి అధికారులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేసి అమలు పరుస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫారాన్ తదితరులున్నారు.

సంతోష్‌నగర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ రఘువీర్ రెడ్డి తదితరులు

సంతోష్‌నగర్: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సంతోష్‌నగర్‌లోని బన్నాక నుంచి ప్రారంభమైన ఈ ఫ్లాగ్ మార్చ్ అన్మోల్ ఎక్స్ రోడ్డు, కుమ్మర్‌వాడీ, యూనిక్ స్కూల్, మోయిన్‌బాగ్, జమాల్ కాలనీ, రక్షాపురం, అరుంధతి కాలనీ, గుల్షన్ ఎక్బాల్ కాలనీ తదితర ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, సంతోష్‌నగర్ పోలీసులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్ మాట్లాడుతూ..ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి ఆందోళన చెందకుండా నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.రఘువీర్ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ స్టాన్లీ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరసింహా నాయక్

సంతోష్‌నగర్: విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసింహా నాయక్ అన్నారు. చంచల్‌గూడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోషామహల్ ట్రాఫిక్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌స్పెక్టర్ నరసింహా నాయక్ మాట్లాడుతూ..విద్యార్థులు కళాశాలకు రాకపోకలు సాగించే క్రమంలో జీబ్రా క్రాసింగ్ సమయంలో జాగ్రత్తగా వెళ్లాలన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన ఏర్పచుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వి పుత్లిబౌలీ, ఉస్మాన్‌గంజ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్, అఫ్జల్‌గంజ్ బస్‌స్టాండ్, సీబీఎస్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్, ఉస్మానియా ఆస్పత్రి లేన్, గోల్ మజీద్ లేన్ తదితర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరింత చేరువగా ఉండి వారి మన్ననలు పొందడమే తమ లక్ష్యమని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ డి.వి.కె.మూర్తి అన్నారు. ఇందుకు తాము ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు వారి కోరిన చోటకు బస్సు సర్వీసులు నడపడం వంటి సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దీని కోసం నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు బస్సు సర్వీసులు, ప్రయాణికులకు సూచనలను తమకు తెలపవచ్చునని ఆయన తెలిపారు. తమ సలహాలు, సూచనలను 99592 26133 లో సంప్రదించాలని సూచించారు.

నేడు దావత్ హే ఇఫ్తార్

గోల్కొండ: విద్యార్థులు వారి తల్లిండ్రులతో కలిసి దావత్ హే ఇఫ్తార్ అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ తెలిపారు. నేడు టోలిచౌకీలోని ప్లీజెంట్ గార్డెన్‌లో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. వీనస్ హైస్కూల్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ ఇఫ్తార్‌లో పాల్గొంటున్నారన్నారు. తమ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత చదువు చదివి వ్యాపార, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు సైతం ఈ ఇఫ్తార్‌లో పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

తల్లీ, కూతురు అదృశ్యం



అనిత సింగ్



ఆలియా

అబిడ్స్: ఇంట్లో చెప్పకుండా ఆరు నెలల కూతురుతో గృహిణి అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్ కథనం ప్రకారం..ధూల్‌పేట్ బంగ్లాదేశ్ ప్రాంతంలో నివాసం ఉండే లఖన్‌సింగ్‌తో అనిత సింగ్(23)కు 2018లో వివాహం అయ్యింది. వీరికి ముగ్గురు సంతానం. ఈనెల 26న సాయంత్రం అనితసింగ్ తన ఆరు నెలల కూతురు ఆలియాతో గంగాబౌలిలో ఉన్న నాయనమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి అర్ధరాత్రి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. 27న ఉదయం అనితసింగ్, భర్త లఖన్‌సింగ్ భార్యకు టిఫిన్ ఇవ్వడానికి వెళ్లగా ఆమె కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అనితసింగ్ సోదరుడు అక్షయ్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ జి.అంబిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

అబిడ్స్: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.48 వేల రూపాయాల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం..మంగళ్‌హాట్ ప్రాంతంలో నివాసం ఉండే బాలకృష్ణ, క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి జరిపి బాలకృష్ణను అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



రివ్యూ మీటింగ్‌లో డాక్టర్ రాజశ్రీ

చార్మినార్: పాతబస్తీలోని స్థానిక ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని చార్మినార్ జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రాజశ్రీ అన్నారు. సూరజ్‌భాన్ క్లస్టర్‌లో బుధవారం సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించరాదన్నారు. ప్రతిరోజూ 25 మందికి స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించారు. టెలిమెడిసిన్‌ను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ సునంద పాల్గొన్నారు.

నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం



మజ్లిస్ నాయకులతో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్

గోల్కొండ: నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో నానల్‌నగర్ డివిజన్‌లోని ఒక బస్తీ కూడా ముంపునకు గురి కాదన్నారు. నిజాం కాలనీ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు సాఫీగా ప్రవహించడానికి బాక్స్ టైప్ డ్రైనేజీలు వేశామన్నారు. హకీంపేట్ కుంటలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ పార్కును కూడా అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, సయ్యద్ జబ్బార్, హారూన్‌ఫరాన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్, అబ్బాస్ హుస్సేన్ తదితరులున్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయంలో దావత్–ఏ–ఇఫ్తార్ నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, యూనిట్ అధ్యక్షులు, సెక్రటరీలు, ప్రాథమిక సభ్యులు, మహిళా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మెగా ఈవెంట్‌లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల ఆరోగ్యం, సంపద కోసం మౌలానా మొహమ్మద్ రియాజుద్దీన్ రక్షబంది, మౌలానా మహ్మద్ ఖలీముద్దీన్‌తో సమాజ్–ఏ–మగ్రిబ్ నిర్వహించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ శ్రీ బొల్లు కిషన్, టీఎన్జీఓ ప్రెసిడెంట్ ఏలూరి శ్రీనివాస్, సెక్రటరీ సత్యనారాయణ, టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్ మారం జగదీశ్వర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకట్, కొండల్‌రెడ్డి, శైలజ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలి



తహసీల్దార్ అహల్యకు ఇఫ్తార్ విందు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని గోల్కొండ తహసీల్దార్ అహల్య అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి బుధవారం ఆమెను కలిశారు. నేడు గోల్కొండలో సంఘం ఆధ్వర్యంలో రిసాలబజార్‌లో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు హాజరుకావాలని కోరుతూ ఆమెకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం సంతోషకరమని ఈ సందర్భంగా తహసీల్దార్ అన్నారు. అయితే ఎన్నికల సంఘం యాప్‌లో ఇఫ్తార్ విందు నమోదు చేసుకోవాలని అదే విధంగా గోల్కొండ డివిజన్ పోలీస్ ఏసీపీకి కూడా దరఖాస్తు సమర్పించుకోవాలని ఆమె సూచించారు. గోల్కొండ మహంకాళీ అమ్మవారి ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులు ఉన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బంది రావొద్దు



జలమండలి అధికారులతో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ: ప్రజలకు తాగునీటి సరఫరాలో సమస్య రాకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ ఆదేశించారు. బుధవారం ఆమె మణికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో జలమండలి, మున్సిపల్ అధికారులతో నీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో సరఫరా అవుతున్న నీటి వివరాలు, సంపులు, ట్యాంకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. రోజుకు సరఫరా అవుతున్న ట్యాంకర్లకు ఉన్న డిమాండ్, సరఫరాకు పడుతున్న సమయాన్ని అడిగి తెలుసుకున్నారు. డిమాండ్ మేరకు ట్యాంకర్లను ఇటీవలే పెంచామని, ప్రస్తుతం బుక్ చేసుకున్న మరుసటి రోజు సరఫరా చేస్తున్నామని సిబ్బంది తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య లేకుండా, సకాలంలో సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, డీజీఎం శ్రీనారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో మహ్మద్ బషీరుద్దీన్

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులకు ప్రతినిత్యం రాత్రి అన్నం అందిస్తూ ముందుకుసాగుతున్నానని గోల్కొండ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నీలోఫర్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. తన స్నేహితులు, శ్రేయోభిలాషుల సహాయ సహకారాలతోనే 770 రోజులుగా నిరంతరాయంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాని ఆయన తెలిపారు.

ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలి



రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోఆస్తిపన్ను చెల్లించని వారు వెంటనే తమ ఆస్తిపన్నును చెల్లించాలని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని 48 మంది మొండి బకాయిదారులకు వారెంట్లను జారీ చేశామన్నారు. మూడు నుంచి ఏడు రోజుల పాటు ఆస్తిపన్ను చెల్లించేందుకు వారికి సమయాన్ని అందించామన్నారు. అయినా చెల్లించకపోతే వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో మొండి బకాయిదారులతో నేరుగా కలుస్తూ.. ఆస్తిపన్నును చెల్లించాలని కోరుతున్నామన్నారు. సర్కిల్ అభివృద్ధికి ఆస్తిపన్ను ఎంతో ముఖ్యమన్నారు. ఐదు డివిజన్ల పరిధిలో నోటీసులను జారీ చేయడంతో వారంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆస్తిపన్నును చెల్లిస్తున్నారన్నారు. నోటీసులు తీసుకుని స్పందించని వారితో తమ అధికారులు, సిబ్బంది నేరుగా వెళ్లి సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. ఆస్తిపన్ను విషయంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఆదివారం కార్యాలయంలో ఆస్తిపన్ను పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 31న పరిష్కార వేదికకు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఆస్తిపన్నును అదే రోజు కార్యాలయంలో నగదు రూపంలో చెల్లించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

పెట్రోల్ బంకులో పిస్టల్‌తో హల్‌చల్

చార్మినార్: ఇద్దరు యువకులు బుధవారం రాత్రి కోట్ల అలీజాలోని పెట్రోల్ బంకులో ద్విచక్ర వాహనంపై వచ్చి పిస్టల్‌తో బెదిరించి పెట్రోల్ పోయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ బంక్‌లోని ముఖేష్ అనే క్యాషియర్ తలపై పిస్టల్ పెట్టి బెదిరించారు. ఇంతలో సిబ్బంది ప్రతిఘటించి యువకులను పట్టుకునే ప్రయత్నం చేయగా.. కొద్ది సేపు హల్ చల్ చేసి..ఒకరు పరారయ్యారు. ఇదే సమయంలో అటువైపు నుంచి వస్తున్న పెట్రోలింగ్ వెహికల్‌లోని పోలీసులు అప్రమత్తమై ఇద్దరిలో ఒకరిని అదుపులోకి తీసుకొని మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరిలో ఒకడు పరారుకాగా మరోవ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నారు. మీర్ చౌక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.